రంగారావు బుర్రలో సామ్యవాద సిద్ధాంతం ప్రవేశించిన ఘడియ చాలా గొప్పదని చెప్పుకోవాలి. ఆ ప్రవేశపెట్టిన రాజకీయ పండితుడూ ఘనుడనే ఒప్పుకోవాలి. ఎంచేతనంటే గురువుగారు సోషలిజం మతం మార్చుకుని, శుద్ధి చేసుకుని, కలిసొచ్చే కార్య కలాపాల్లో మునిగి తేలుతూ, సుఖంగా బతికేస్తూ వుంటే; మనవాడు మాత్రం తిండీ, నీళ్లాలా దాన్ని స్వీకరించి ఆ రెంటికీ చాల అరుదుగా అందుబాటులో వుంటూ, ఎప్పుడూ ప్రజాహిత కార్య కలాపాలతో కాలంగడుపుతున్నాడు. ఎక్కడ యే సమస్య తలెత్తినా రంగారావే ప్రత్యక్షం. ఎక్కడ యే ఆందోళన సాగినా మనవాడే ముందర.

పొరుగువాడు బాధ పడుతూ వుంటే



బొత్తిగా సహించలేడు రంగారావు. తను కష్టపడి అయినా పొరుగువాడి కష్టాల్లో పాలు పంచుకోవాలనుకోవటం అతని మతం. కాని, అతనికి సాంఘిక కార్యకర్తగా చలామణి కావాలనే ఉబలాటం వుందా అంటే, అదీ లేదు. అతను ఎప్పుడూ ఏ మురికి వాడల్లోనూ సభపెట్టి, మురికి వాడల నిర్మూలనం గురించి ఉపన్యసించి చప్పట్లు కొట్టించుకున్న సందర్భాలు లేవు. ఏ పారో, చీపురో చేత్తో పుచ్చుకుని వివిధ భంగిమల్లో ఫొటోలు తీయించుకుని పేపర్లలో వేయించుకున్న ఆచూకీ లేదు.

మరెందుకు?

ఎందుకేమిటి. అదతని జీవిత లక్ష్యం.

ఒకసారి మండు వేసవిలో, ఓ అగంతకుడు బాట పక్కన వడకొట్టి పడి వున్నాడు. అది రంగారావు చూసి. భుజాన్నేసుకుని ఇంటికి మోసుకొచ్చేడు. అన్ని సపర్యలూ చేసి, భోజనం పెట్టి రాత్రికి మెత్తటి పక్క వేసి ఆదరించేడు. తెల్లారి లేచాక చూస్తే అతను లేడు. అతనితో పాటు తన వాచీకూడా అదృశ్యమైంది.

అప్పుడుకూడా అతను కించిత్తు బాధపడలేదు.

—ఏదో కష్టంలో వుండి వుంటాడు. ఇంతకంటే మరో గత్యంతరం లేకపోయింది, అన్నాడు. ఈ సంఘటన జరిగేక

"నువ్వు క్రిష్టియన్‌వి కావాలిసింది" అన్నాడో మిత్రుడు.

"ఎందుకు?"

"నీలాంటి వాళ్ళనే గుడ్ సమరిటన్ అంటారు వాళ్ళు."


"ఒకర్ని కష్టాల్లో ఆదుకోటానికి గుడ్ సమరిటన్‌లు కావాలా? అయితే వియత్నాంలో యుద్ధంచేసి దారుణ హింసాకాండ నెరపింది ఆ గుడ్ సమరిటన్‌లేగా, మతం పేరిట యుద్ధాలు నడిపి మారణ హోమం చేసిందీ వాళ్ళే!!"

"నీకు జీసస్ సిద్ధాంతాలు...."

"తెల్సు....జీసస్ క్రైస్టే మొట్టమొదటి సామ్యవాది అని నా నమ్మకం. కాని క్రిష్టియన్స్ మాత్రం కాదు."

"అంటే, మార్క్సు, లెనినూ, సోషలిస్టులై, ఆ పేరుతో చలామణీ అవుతున్న వాళ్ళు కానట్టు—అవునా?" అని ఎదురు దెబ్బ తీసేడు రంగారావు మిత్రుడు.

ప్రతి సిద్ధాంతమూ ఆచరణలోకి ఒచ్చేటప్పటికి కొంచెం తేలిపోవటం సహజమే. కాని,




మౌలికంగా దాని స్వరూప స్వభావాల్నే మార్చేసి ఆచరణకి అనువుగా మలచుకోవాలనుకోవటం ఆత్మవంచన విశ్వాస హీనత"

సగం ఒప్పుకునీ, సగం ఒప్పుకోక తన అభియోగాన్ని తోసి పారేసినట్టుగా అభిప్రాయపడ్డాడు అతని మిత్రుడు. అంతేగాని ఆట పట్టించాలనే అభిప్రాయం కలగలా అతనికి. రంగారావు నిజాయితీని యెరిగిన యెవరికైనా సరే, అలా అనిపించదు.

రంగారావు ఇంట్లోవాళ్ళకు ఒక సమస్యగా తయారయ్యేడు. ఆకలని అనడం పాపం, దారినపోయే ఏ దానయ్యైనాసరే, అర్థరాత్రనీ లేదు, అపరాత్రనీ లేదు, ఇంటికి పిల్చుకొచ్చి సుష్టుగా భోజనంపెట్టి మరీ సాగనంపుతాడు. అడగటం పాపం - చేతికొచ్చినంతా జేబులోంచి తీసి ఇచ్చేస్తాడు. అదీ అపాత్రదానం కాదు. అర్హత నుబట్టే!!

ఒకసారి రైలు దిగి ఇంటికొస్తున్నాడు రంగారావు. శీతాకాలం. ఎముకలు కొరికేస్తోంది చలి. రోడ్డుపక్కన ఒక ముసిలాడు ఒణికిపోతో కన్పించేడు రంగారావుకు. అంతే, చొక్కా తీసి అతనికి తొడిగి, శాలువా కప్పి ఆ చలిలో ఒణుకుతో ఇంటికి చేరుకున్నాడు. అతని ఉదారహృదయానికి ఇలాంటివి అతిస్వల్ప ఉదాహరణలు.

ఇక ఖర్చంటారా? అతని చేతికి నరం లేదు.

"ఇలా ఖర్చు పెడుతోపోతే ఎంత వుంటే మాత్రం నిలుస్తుంది!" అని యెవరైనా అంటే, తడుంకోకుండా సమాధానం చెప్పేస్తాడు రంగారావు.

"యేం....ఎందుకు నిలవాలి? దేశంలో తొంభై శాతం ఆకలితో అలమటించిపోతో వుంటే, నువు ఆస్థిపట్టుకు వేలాడి, దాన్ని పెంపు చేసుకునే హక్కు నీకెక్కడిది?"

"లేదు. కాని, అందరూ చేస్తున్నది అదేగా!! నువొక్కడివీ...."

"నేనేదో చేస్తున్నానని కాదు. ఎవరి మాటైనా అంతే. దేశంలో సామ్యవాద సమాజం నెలకొనటానికి ఇహ అట్టేకాలం పట్టదు. అప్పుడైనా మనం ఆస్తుల్ని ప్రభుత్వానికి అప్పగించాల్సిందేగా!"

—సామ్యవాద సమాజం అంటే ఏమిటో అదసలు ఎప్పుడు వచ్చి చస్తుందో ఆ బ్రహ్మకే తెలియాలి. కాని వీడి వ్యవహారం మాత్రం శృతిమించి రాగాన పడుతోంది; అని వాపోతాడు తండ్రి.

—కంటికి నిద్దరలేదు. ఒంటికి సుఖం లేదు. ఏమిట్రా నాన్నా నీకీపాట్లు, అని కంట తడి పెడుతుంది కన్నతల్లి.

ఎన్ని అన్నా అతని ధోరణి అతనిదే! ఇక పెళ్ళి ఒక్కటే ఇందుకు విరుగుడని వాళ్ళిద్దరూ ఒక నిర్ణయానికి ఒచ్చేసేరు. వాళ్ళ అదృష్టం కొద్దీ అతగాడు పెళ్ళి ఒద్దని మాత్రం భీష్మించలేదు.

తండ్రి అమ్మాయికోసం గాలింపు మొదలెట్టేడు.

"మంచి సంబంధం ఒకటి చూసేను రంగా, అమ్మాయి చక్కగా వుంటుంది. బాగా ఆస్థి వున్నవాళ్ళే, ముప్పయి దాకా ఇస్తామంటున్నారు" అని చెప్పేడు తండ్రి.

"అదేమిటి నాన్నా! అంత ఆస్థి వున్న వాళ్ళు నాకివ్వటం దేనికి? లేనివాడికైనా యిస్తే ఒక కుటుంబం బాగుపడుతుందిగా" అన్నాడు.

తండ్రికి ఇలా అంటాడని ముందే తెల్సు.

"అమ్మాయి చాలా బావుంటుందిరా."

"అమ్మాయికి నేను కూడా బావుండా నాన్నా."

ఆయనకి విసుగేసుకొచ్చింది.

"అలా అనుకుంటే ఎన్ని పెళ్ళి తాయిరా రంగా" అన్నాడు.

"అనుకోవటం లేదు కాబట్టే సమాజం ఇంత అధ్వాన్నంగా వుంది."

"అయినా, ఆడదానికి నచ్చ ఏమిట్రా?" అనేసి నాలిక్కరుచుకున్నా తండ్రి.

రంగారావు తారాస్థాయికి లేచిపోయేడ

"ఏం....ఆడది మనిషి కాదా? మనసున ఒక్క మగాడికేనా? అసలు స్త్రీ అస్వతం ఇక్కణ్నుంచే ఆరంభమౌతుంది. ఇ లేదని నోరువిప్పి చెప్పలేక, బలి పశువ తల్లిదండ్రులు తెచ్చిన ఏ పనికిమా వాణ్నయినా వరే పెళ్ళి చేసుకుని, వా జీవితాన్ని వికృష్టం చేసుకుని, కుళ్ళి కృ పోవటం....లేదా. కొంచెం తెగువత వుంటే పెడదార్లు పట్టడం....ఇవన్నీ స జానికీ' వ్యక్తికి అంత ఆరోగ్యదాయ కావు. సామ్యవాద సమాజంలో యిలా అసమానతలు, భేదాలు వుండవు. అంద సమానమే. అందరికీ సమానమైన స్వే స్వాతంత్ర్యాలు లభిస్తాయి. ఆర్థికంగా, కీయంగా. నైతికంగా కూడా — పా దృక్పథం అంటూ వుండదు" అని ఓ వుపన్యాసం ఇచ్చేడు.

"పక్షపాతం అనేది అసలు ప్రకృతి వుందిరా. మానవుడెవడు కాదనడానికి? నీ వేళ్ళన్నీ సమానంగా వున్నాయా? ఆ చె పుట్టా ఒకేలా వున్నాయా?" అంటూ వేదాం మొదలెట్టేడు ముసలాయన.


"చేతివేళ్ళన్నీ సమానంగా వుంటే అ దుకూ పనికిరావు నాన్నా!"

"ఆ....అదేరా నేనూ అంటున్నదీ."

"నువ్వంటున్నది అది కాదులే నా చేతి వేళ్ళ సామ్యం తీసుకొచ్చేవు బా వుంది. మరి వాటిలో రక్తం సమానం ప్రసరిస్తుందనే సత్యం తెలియెద్దా? ఆ చె పుట్టా ఒకేలా లేకపోయినా, వాటికి ఆహా ఒకలానే లభిస్తోందిగా."

ఈ వాగ్వాదంలో తండ్రి ఎప్పుడూ పోవటం ఖాయం. అలాంటప్పుడు—

"ఇవన్నీ ఒట్టి సిద్ధాంతాల్రా! ఆచర సాధ్యపడవు. అందరూ పల్లకీ యెక్కేవా




అయితే మోసే వాళ్ళెవరు?" అంటాడు.

"ఒకడు ఎక్కేవాడూ పదిమంది మోసే వాళ్ళూ యెందుకుండాలి? అసలు పల్లకీనే యెత్తేస్తే పోలా!!"

"సరే! తీసి పారెయ్యండి, ఎవడికీ నష్టం లేదు. అందరికీ సమానంగా పంపిణీ కావాలంటారే! అదెక్కడ సాధ్యమౌతుంది! ఒక గిన్నెలో పాయసం వుంది. అది చాల పరిమితం. వందమంది పిల్లలున్నారు. ఎవరికని పంచుతావు?" అనడిగేడు తండ్రి.

"ఎవడికో నీ యిష్టం వచ్చిన వాడికే గిన్నెంతా ఇచ్చెయ్యకుండా, చిన్న గరిటెతో అందరికీ సమానంగా పంచాలన్నది మా సిద్ధాంతం."

ముసిలాడు విసిగి ఇక వాగ్వాదాన్ని పొడిగించటం ఇష్టంలేక వూరుకున్నాడు. ఒక్కడే కొడుకు. స్నేహితుల్నా పెంచేడు. పోనీ లెమ్మని వూరుకుంటాడు.

*　　　*　　　*

కట్నం కావాలని అడిగేవాడికంటే ఒద్దనే వాడే చెడ్డాడు జనం దృష్టిలో.

—ఏదో లోసుగుంది. లేకుంటే కట్నం ఇస్తుంటే ఒద్దనే దద్దమ్మెవడుంటాడు? అంటారు. దానికితోడు రంగారావు వెళ్ళిన చోటల్లా ఏవో ఆంక్షలు పెడుతూ ఒచ్చేడు. అమ్మాయిలకైతే అదో క్విజ్ టెస్టులా అనిపించేది.

ఒకచోట ఎం. ఎ. పొలిటికల్ సైన్స్ చదూకున్న అమ్మాయి తటస్థించింది పెళ్ళి చూపుల్లో.

"మీకు సామ్యవాద సిద్ధాంతాలమీద నమ్మకం వుందా?" అనడిగేడు.

అదేమిటో తెలీక ఆమె తికమక పడిపోయింది.

మరోచోట అదే మాట అడిగితే.

"ఓ....నేను మార్క్సిస్టు లిటరేచరు చాలా చదివేను" అన్నదా అమ్మాయి.

"చాల సంతోషమండీ, ఎమిలీ బరన్స్ చదివేరా!" అనడిగేడు.

ఆమె ముఖం వేళ్ళాడేసింది.

ఇక తల్లిదండ్రులకు షరతులు:

—పెళ్ళికి హంగామా వుండకూడదు.

—అంతగా అవసరం అనుకుంటే దండలు మార్చుకోవటం తప్ప సూత్రధారణ లాంటి తతంగం వుండకూడదు.

ఇలాంటివే ఇంకేవేమిటో—

ఇలాంటివాడికి పెళ్ళేమవుతుంది చెప్పండి.

కాని పెళ్ళయింది రంగారావుకి.

సావిత్రి అనే బి. యస్సీ. చదూకున్న అమ్మాయి, అతని భావాలకు ముగ్ధురాలై పెళ్ళి చేసుకుంది.

పెళ్ళికి ముందు రంగారావు మామగారు ఏవో లాంఛనాలంటూ ప్రాధేయపడ్డాడు.

"మీ ఆశయాలు మంచివేబాబూ, కాదనను. కాని, మా ఆనందం కూడా...."

"అది ఆనందం కాదండీ, ఆ ముసుగులో వున్న విషాదం. ఈ సమాజం సాంప్రదాయాల పేరుమీద విధించిన అదృశ్య సుంకాలని తిరస్కరించలేక పడుతోన్న యాతన" అన్నాడు.

సావిత్రి చాల సంతోషించింది.

"పోనీలే నాన్నా, వారి ఇష్టం వచ్చినట్టే

జరిపించండి" అని తండ్రికి సలహా ఇచ్చింది.

ఆ అభిప్రాయాన్నే ఆమె జీవితాంతాం నిలుపుకుంది. అందుకే వాళ్ళ యిల్లు ఓ ధర్మ సత్రంగా తయారైంది. రంగారావుకు, అనుయాయులూ, సహచరులూ యెక్కువయ్యేరు. ఎప్పుడూ ఏదో వంటలూ వార్పులతో సతమతమౌతో వుంటుంది సావిత్రి.

"ఆడదానికి ఒక్క వంటయిల్లే స్వర్గం కాదు సావిత్రీ. కొంచెం బయటి ప్రపంచాన్ని కూడా చూడాలి. సమాజంలో ఏం జరుగుతోందో పరిశీలించి దాని పురోగతికి సాయపడాలి" అంటూ వుంటాడు రంగారావు.

"మీకు అడ్డుతగలడం లేదుగా, అదే ఓ పెద్ద సాయం" అని తప్పించుకుంటూ వుంటుంది సావిత్రి.

ఆ అడ్డు తగలకపోవటం అనే ఆమె ఆత్మసంతృప్తే అతన్ని మరింత ముందుకు లాక్కుపోయింది. అతని ఖర్చులిప్పుడు ఎన్నికల విరాళాల దగ్గర్నుంచి పాఠశాలల నిర్మాణం వరకూ విస్తరించుకున్నాయి.

అయిదేళ్ళ తర్వాత అతని ఆస్థిలో మిగిలింది సగం మాత్రమే.

ఆస్థి తరుగుతోన్నకొద్దీ, అతనికి భార్య అంటే ఒక విధమైన భయం ఏర్పడింది. ఆమె ఏమని పోతుందోనని లోపల్లోపల ఒణికిపోతో వుంటాడు. అలాంటప్పుడు:

"చూసేవా సావిత్రీ దేశంలో రాజకీయ పరిణామాలు ఎంత తీవ్రంగా జరుగుతున్నాయో. బోల్షలిక్ విప్లవానికి ముందు రష్యాలో అచ్చం ఇట్లానే జరిగింది" అని ఆమెను సంతృప్తి పర్చినట్టు ఆత్మవంచన చేసుకుంటోవుంటాడు.

ఆమె సంతృప్తి పడినట్టే చిరునవ్వొకటి నవ్వి తనపనుల్లోనిమగ్నమైపోతో వుంటుంది.

*　　　*　　　*

ఇప్పుడు రంగారావుకు ఇద్దరబ్బాయిలు. రెండో కాన్పుకి ముందు అడిగింది సావిత్రి.

"మీరేమీ అనుకోకపోతే చిన్న మాటండీ" అని.

"అదేంవిటి సావిత్రీ నన్ను శాసించాల్సినదానివి, నువ్వే అట్లా ప్రాధేయపడతావే. చెప్పు" అన్నాడు.

"ఏంవీ లేదండీ: మన కుటుంబ పరిస్థితులు నానాటికీ మారిపోతున్నాయి. మనం యిద్దరితో ఆపేస్తే బావుంటుందేమో."

అతనికి చురుక్కుమనిపించింది. అయినా మామూలు ధోరణిలో పకపకా నవ్వేసి

"పిచ్చిదానా: నువుకూడా ప్రభుత్వంవారి ప్రచార సుడిగుండంలో చిక్కుకుపోయినట్టున్నావు. ఇదంతా పెట్టుబడిదారీ సమాజ లక్షణం సావిత్రీ. సామ్యవాద సమాజంలో జనాభా సమస్య వుండదు" అన్నాడు. "అప్పుడు పుట్టే ప్రతి బిడ్డ బాధ్యతా ప్రభుత్వమే స్వీకరిస్తుంది."

ఆమె మాట్లాళ్ళేదు, మళ్ళీ—

"చూడు సావిత్రీ: జనసంఖ్యని అదుపులో పెట్టినంత మాత్రాన దేశ ఆర్థిక పరిస్థితి బాగుపడదు. అది అనుసరిస్తోన్న ఆర్థిక విధానాల మీదా, శ్రామిక శక్తిని ప్రగతి ప్రయోజనాలకి వాడుకోవటం పైనా ఆధారపడి వుంటుంది" అన్నాడు.

"ఇప్పుడు మనం దేశాన్ని గురించి ఆలోచించే దశను దాటిపోయామండీ. మన కుటుంబాన్నిగురించి ఆలోచించాల్సిన స్థితికి ఒచ్చేం" ంది ప్రశాంతంగానే.

ఆమె యెప్పుడూ అలా మాట్లాడ్డం యెరడు రంగారావు. కొంచెం కోపమొచ్చినట్టుంది.

"మనిషికి ఒక్క నోరే కాదు సావిత్రీ. ండు చేతులుకూడా వున్నాయి" అనేసి చకగా అక్కణ్నుంచి వెళ్ళిపోయేడు.

సావిత్రి ఆ ప్రశక్తి తేలేదు.

సంతానం అలా పెరుగుతోనే వుంది.

ఆస్థి తరుగుతోనే వుంది.

ఆ రెండు ఒక్కచోట ఆగేయి. సంతానం ఇకి పెరిగి, ఆస్థి పూజ్యం అయిన చోటు .

*　　　*　　　*

రంగారావుకు వయసు పెరుగుతోంది. యసుతోబాటు దేశంలో సంభవిస్తోన్న అనేక ణామాలు అతనికి అనుభవేద్యమౌతు యి. కాని అతను ఆశించిన సామ్యవాద రాజం మాత్రం ఒక కలగానే మిగిలి యింది. అయినా ఆ సిద్ధాంతాలమీద అతని ్వసం కొంచెమైనా సడల్లేదు. ఎప్పుడో వి వకరమైన పరిణామాలు సంభవించి, సె మ్యవాద సమాజం ఆవిర్భవిస్తుందని ఆ చో వుంటాడు.

అప్పుడప్పుడూ అతని ఆలోచన్లు కాస్త వె క్క మళ్ళుతో వుంటాయి.

—తను ఎంతో ఐశ్వర్యంలో పెరిగేడు. త: పిల్లలు మాత్రం తీరని దరిద్రంలో కు ంకుపోయేరు. వాళ్ళకి సరైన తిండి పెట్టలే: పోతున్నాడు. సరైన చదువు చెప్పించలే: పోతున్నాడు.

ెంటనే మళ్ళీ తనను తాను సంబాళించుకుని—

—దేశంలో యెంతమంది పిల్లల దరిద్రంతో దహించుకుపోవటం లేదు: అవి పరిపెట్టుకుంటాడు.

అలా అతను సంతృప్తిపడటం సహజమే. కాని, పిల్లలో? వాళ్లకూడా అలా సంతృప్తిపడాలిగా: ఉహూ....వాళ్లాస్థితిలో లేరు. మారుతోన్న సమాజంలో వాళ్ళ మానసిక స్థితి అందుకు భిన్నంగా వుంది.

—తిండి పెట్టలేని వాడివి యెందుకు కనాలి?

ఇదీ వాళ్ల సూటి ప్రశ్న.

*　　　*　　　*

తిరిగి తిరిగి కొంచెం ఆలస్యంగా ఇంటికొచ్చేడు రంగారావు. రెండో కొడుకు అతని కోసం గుమ్మంలో వేచివున్నాడు. అతని వాలకం చూస్తే ఏదో తాడో పేడో తేల్చుకోవాలని వున్నట్టుంది.

"ఈ దరిద్రాన్ని ఇంక భరించలేం" అన్నాడు సూటిగా.

"మరేం చేయాలనుకుంటున్నావు?"

"ఏం చేయమంటావో నువ్వే చెప్పు. గంగలో దూకమంటావో విషం తీసుకు చావమంటావో?"

"నేనే ఎందుకు చెప్పాలి:"

"ఈ దుస్థితికి కారకుడవు నువ్వు. నువ్వే చెప్పాలి" అన్నాడు తీవ్రంగా.

రంగారావు దగ్గర మాటల్లేవు. కుర్రాడు చ్చిపోయేడు.

"సామ్యవాద సమాజం, ఉన్నది పదిమంది నికిమాలిన వాళ్లకి పంచిపెట్టేస్తే రాదు. ఆ వసరం అందరికీ కలగాలి. దేశమంతా ఉవ్వెత్తున పొంగి ముంచెత్తాలి ఈ వ్యవస్థను. నువ్వేదో ఉద్ధరిస్తున్నానని ఆత్మవంచన చేసుకుంటూ వుంటే...."

తల్లి ఇక సహించలేకపోయింది. కుర్రాణ్ణి వతలికి లాక్కుపోయింది.

ఎప్పుడూ వందిమాగధుల స్తోత్రాలేగాని స్తవాన్ని యెరగని రంగారావుకు, సమస్యకి ఏదో నూతన పరిష్కారం పొడగట్టినట్టనిపించింది.

—అవును. తన భావాలు బూజు పట్టిపోయేయి. ఇప్పటి యువతరం ఆలోచనా విధానం....అవును .. ఉవ్వెత్తున పొంగి ఈ వ్యవస్థను ముంచెయ్యాలి.

ఆ రాత్రి నిద్రపట్టలేదు రంగారావుకు.

మరెప్పుడూ....ను. □